

గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

- మహారాష్ట్ర కేంద్రంగా సరఫరా
- రంగంలోకి దిగిన పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు
- మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలపై నిఘా

కాగజ్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది..? ఎంతమంది ఈ దందాకు పాల్పడుతున్నారనే కోణంలో జిల్లా పోలీసులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో కూడా జిల్లాలో గంజాయి సాగు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతున్నారు. గురువారం వాంకిడి చెక్‌పోస్టు సమీపంలో సినిమా తరహాలో గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇందులో 290కేజీలు పట్టుబడగా, వీటి విలువ రూ.72.80లక్షల ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. ఇంత పెద్ద మొత్తంలో పట్టుకోవటం జిల్లాలో ఇదే మొదటిసారి కావటం విశేషం. ఈ సంఘటన ఒక్కసారిగా సంచలనం రేపింది. నెలరోజులుగా వీరిపై దృష్టిసారించి జిల్లా పోలీసు యంత్రాంగం ఈ కేసును ఛేదించి సఫలీకృతులయ్యారు.



వాంకిడిలో పట్టుకున్న గంజాయి

● మహారాష్ట్ర కేంద్రంగా దందా..

జిల్లాను ఆనుకొని ఉన్న మహారాష్ట్రలోని పలుజిల్లాల నుంచి కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ నియోజకవర్గాల్లో తరలించి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. గంజాయి మత్తుకు యువత బానిస అవుతుండటంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి గంజాయి ఆనవాళ్లు లేకుండా కఠినచర్యలు తీసుకుంటోంది. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. పక్కాగా సమాచారం తీసుకొని టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణ, మండల ప్రాంతాల్లో గంజాయిని హుక్కాలో వినియోగిస్తున్నట్లు సమాచారం రావటంతో పోలీసులు మూడునెలల క్రితం దాడులు చేసి పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికీ సర్‌సిల్క్ ఏరియా, కోసిని, ఎర్రోడ్రం ప్రాంతాలపై పోలీసులు దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో గంజాయి తాగుతున్నట్టు సమాచారం వస్తుండటంతో పోలీసులు పక్కా స్కెచ్ వేసి పట్టేస్తున్నారు.

● గంజాయితో అనర్థమే..

గంజాయి తీసుకోవటంతో స్కిజోఫ్రేనియా వంటి తీవ్రమైన మానసిక రుగ్మతలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని డాక్టర్లు పేర్కొంటున్నారు. గంజాయి తీసుకునే యువకుల మెదడు అభివృద్ధి పరంగా పాడవటం, జ్ఞాపకశక్తి, ఇతర సామార్థ్యాలు పూర్తిగా దెబ్బతింటాయని వైద్యులు సూచిస్తున్నారు. వీటితో పాటు ప్రధానంగా గంజాయి పొగ పీల్చటం వల్ల శోధం, దగ్గు, ఇతర శ్వాస సంబంధిత సమస్యలు ఉత్పన్నవుతున్నట్టు వివరిస్తున్నారు.

● 290కిలోల గంజాయి పట్టివేత

వాంకిడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వాంకిడి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం భారీగా గంజాయి పట్టుకున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజమండ్రి నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్తున్న ఎంపీ06 హెచ్‌సీ 1339 నంబరు గల కంటైనర్ లారీలో 290కిలోల గంజాయి అక్రమంగా తరలిస్తుండగా వాంకిడి అంతరాష్ట్ర చెక్ పోస్టువద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్నసమయంలో పట్టుకున్నామన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ బల్వీర్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మహారాష్ట్రకు చెందిన అరబింద్ అనేవ్యక్తి తనను గంజాయి సరఫరా కోసం రాజమండ్రికి పంపించాడన్నారు. అక్కడినుంచి గంజాయిని లోడ్‌చేసుకుని వస్తున్నానన్నాడు. కంటైనర్ లారీ నుంచి 2కేజీలు బరువుగల 145గంజాయి ప్యాకెట్లు మొత్తం 290కిలోలు, కంటైనర్ లారీ, ఒకసెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.72,50,000వేలు ఉంటుందన్నారు. గంజాయి సరఫరాలో ముఖ్యనిందితుడైన అరబింద్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డిఎస్పీ కరుణాకర్, వాంకిడి సీఐ సత్యనారాయణ, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, ఆసిఫాబాద్ సీఐ రవీందర్, వాంకిడి ఎస్సై ప్రశాంత్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఎవరినీ ఉపేక్షించేది లేదు..

-రామానుజం, డీఎస్పీ, కాగజ్‌నగర్



గంజాయి విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు. ఇప్పటికే గంజాయి సరఫరా అయ్యే కేంద్రాలపై గట్టి నిఘా పెట్టాం. తప్పకుండా కేసులు నమోదు చేస్తాం. ఎవరూ గంజాయి జోలికి పోరాదు. ఈ దందాను ఎవరూ చేయరాదు. ఎలాంటి సమాచారం ఉన్న పోలీసుల దృష్టికి తీసుకరావాలి. తప్పకుండా కేసులు నమోదు చేస్తాం.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం: ఎస్పీ

ఆసిఫాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారత దేశ ప్రథమ హోంశాఖ మంత్రి, ప్రథమ ఉపప్రధాని సర్దార్ వల్లబాయిపటేల్ దేశానికిచేసిన సేవలు చిరస్మ రణీయమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు కొనియాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్‌జయంతిని పురస్కరించుకొని గురువారంజిల్లా కేంద్రంలోని పోలీసుకార్యాలయంలో వల్లబాయిపటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశ భద్రత కోసం ఐక్యత కోసం ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. అనంతరం పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్ర మంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, సీఐ బుద్దే రవీందర్, పెద్దన్న, పోలీసులు అధికారులు అంజన్న, లవన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30పోలీసు యాక్టు అమలు..

శాంతిభద్రతల దృష్ట్యాజిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణాన్ని మరింత సవ్యంగా కొనసాగించడానికి అక్టోబరు 31నుంచి ఈనెల30వరకు జిల్లాఅంతటా 30పోలీసు యాక్టు అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాపోలీసు కార్యాలయంలో ఆయనమాట్లాడుతూ ముందస్తు అనుమతులులేకుండా ఎలాంటి ప్రజాసమావేశాలు, ఊరేగింపులు,ధర్నా, బహిరంగసభలు తదితరప్రజలు గుమికూడేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదన్నారు. ప్రజాజీవనానికి ఇబ్బంది, చిరాకు కలిగించే లౌడ్‌స్పీకర్లు, డీజేలు వంటివి నిషేదమని తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

డీఎస్పీ సత్యనారాయణకు కేంద్ర ప్రభుత్వ అవార్డు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 2019 నవంబర్‌లో సంచలనం సృష్టించిన సమత అత్యాచారం, హత్యకేసును ఛేధించడంలో.. నిందితులకు శిక్షపడేలా చేయడంలో ప్రముఖపాత్ర వహించిన అప్పటిడీఎస్పీ సత్యనారాయణకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కేంద్రీయ గృహమంత్రి దక్షితపదక్ అవార్డుకు ఎంపిక చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. దేశవ్యాప్తంగా సాధారణ పోలీసుల విభాగంలో వివిధకేసుల్లో నిందితులకు శిక్షపడేలా చేసిన 107మంది అవార్డుకు ఎంపికకాగా ఫోరెన్సిక్‌విభాగంలో 8మంది ఎంపికయ్యారు. గతంలో జిల్లాలో పనిచేసిన డీఎస్పీ ఎంపిక కావడంపై జిల్లా ప్రజలు, పోలీసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం ప్రస్తుతం వరంగల్‌లో ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న డీఎస్పీ సత్యనారాయణను సంప్రదించగా పనికి తగిన గుర్తింపు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.



డీఎస్పీ సత్యనారాయణ

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్/కెరమెరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఇతర అన్నిఅంశాలపై ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం అడ గ్రామపంచాయతీ, పట్టణంలోని బజార్‌వాడి ఏరియాలో, కెరమెరి మండలకేంద్రంలోని కెరమెరి గ్రామపంచాయతీలో కొనసాగుతున్న సర్వేతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సర్వేను జిల్లాలో అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోనిగ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో సర్వేకుఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించామన్నారు. ప్రతి ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల వ్యక్తిగతవివరాలు, కుటుంబ వివరాలు సేకించాలనితెలిపారు. కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌కింద నిర్ణయించిన కుటుంబాల వివరాలు నమోదుచేయాలన్నారు. ఎన్యుమరేటర్ సేకరించిన వివరాలలో 10శాతం రాండమ్ కుటుంబాలను ఎంపికచేసుకొని ఆ ఇళ్లను సూపర్‌వైజర్ సందర్శించివివరాలను పునఃపరిశీలించాలని తెలిపారు. వివరాల సేకణలో గోప్యత, నైతిక ప్రమాణాలు పాటించాలన్నారు. కేటాయించిన బ్లాక్‌లో అన్ని కుటుంబా లను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ

బెజ్జూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవినీతి అక్రమాలపై ఆ శాఖలో పనిచేస్తున్న కార్యదర్శులు జక్కుల వెంకటేశ్వర్‌గౌడ్, పర్శ సంజీవ్‌తోపాటు డాటా ఆపరేటర్ మహేష్‌ను సస్పెన్షన్ చేస్తూ బెజ్జూరు సహకార సంఘానికి ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా సహకార అధికారి బిక్కురాథోడ్ పేర్కొన్నారు. ఈ విషయమై సహకార అధికారిని సంప్రదించగా జీవో 44ప్రకారం సొసైటీలో విధులు నిర్వహించే ముగ్గురు ఉద్యోగులను సస్పెన్షన్ చేయడం కోసం సొసైటీ తీర్మాణం చేయాల్సి ఉంటుందని దీంట్లో భాగంగానే సహకారసంఘానికి ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

అటవీ శాఖాధికారులపై ఫిర్యాదు

సిర్పూర్(టి), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సిర్పూర్ (టి) ఫారెస్టురేంజ్ అధికారులపై శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రెటరీ డోనియల్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నాలుగు రోజులక్రితం మండలంలోని బెంగాలీక్యాంపునకు చెందిన ఎనిమిది మందిపై అటవీశాఖాధికారులు అక్రమంగా కేసులు పెట్టి వారిని జైలుపాలు చేశారని ఈవిషయమై విచారణ జరిపిశాఖపర మైన చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రిన్సిపాల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి క్రీడాకారుల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అథ్లెటిక్స్ అండర్-14, 17జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈపోటీలను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, సీఐ బుద్దే రవీందర్ పాల్గొని క్రీడాకారులను పరి చయం చేసుకుని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ఈ క్రీడల్లో 150 మంది బాలికలు పాల్గొన్నట్లు క్రీడల అధికారి మీనారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ బాలేష్‌గౌడ్, ఏసీఎంవో ఉద్దవ్, కార్యదర్శి సాంబశివరావు, ప్రధానోపాధ్యాయుడు జంగు, వార్డెన్ సాయిబాబా, శిక్షకుడు విద్యాసాగర్, పీడీ విశ్వనాథ్, లక్ష్మణ్, కృష్ణమూర్తి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

సిర్పూర్(యు), నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): ఆదివాసీలు తమ సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని పిట్టగూడలో ఆదివాసీల ఆరాధ్యదైవం ఎత్మసార్ దేవతలఉత్సవాలలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జైనూర్‌మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లాఎస్టీ చైర్మన్ కుడ్మేతవిశ్వనాద్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దండారిదైవాలకు వారుపూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివాసీ మహిళాలతోకలిసి సంప్రదాయనృత్యాలు చేశారు. గ్రామస్తులం దరితో కలిసి సహపంక్తిభోజనాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, తోడసం ధర్మారావు, మాజీసర్పంచ్ ఆర్క నాగోరావు,గ్రామ పటేల్ జంగు తదితరులు పాల్గొన్నారు.



దండారి దేవతలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆదివాసీ చిత్రకారుడిని సన్మానించిన పీవో



ఆనంద్‌రావును అభినందిస్తున్న ఖుష్బూ గుప్తా

జైనూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాసిమెట్ట గ్రామానికి చెందిన మడావి ఆనంద్ రావు ఇటీవల రాష్ట్రపతి చేతులు మీదుగా ఉత్తమ చిత్రకారుడుగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఆయనను ఉట్నూర్‌లో ఐటీడీఏపీవో ఖుష్బూగుప్తా తన కార్యాలయంలో సన్మానించారు. రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ చిత్రకళకారుడిగా అవార్డు అందుకునందుకు పీవో ఆయనను అభినందించారు. కార్యక్రమంలో గిరిజన ఉపాధి అధికారి నాగభుషణం, బీఈడీ కాలేజ్ ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, గోండు చిత్రకళకారుడు మడావి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా దీప్‌దాన్ ఉత్సవ్ కార్యక్రమం

వాంకిడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జైతావన్ బుద్ధవిహార్‌లో గురువారం రాత్రి దీప్‌దాన్‌ఉత్సవ్ ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గౌతమబుద్ధుడి చిత్రపటం ఎదుట వందలాది దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్‌కార్ మాట్లాడుతూ 18ఏళ్ల తరువాత బుద్ధుడిగా మారి తనస్వంత రాజ్యం కపిలవస్తుకు తిరిగి ఆగమనంచేసిన సందర్భాన్ని పురస్కరించుకొని కపిలవస్తు రాజ్యంలో ప్రజలందరూ దీపకాంతులతో బుద్ధుడికి స్వాగతం పలకడంతో ఈరోజు దీప్‌దాన్ ఉత్సవం కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజనసంఘం ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, విలాస్, రాజేంద్ర ప్రసాద్, దుర్గం హంసరాజ్, విజయ్‌ఉప్రె, దుర్గం సందీప్, అరుణ్, ప్రతాప్, జైపాల్,రోషన్, విఠల్ పాల్గొన్నారు.



దీప్‌దాన్‌లో పాల్గొన్న ఉపాసకులు

కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబాపూలే, తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్, జూనియర్ కళాశాలలు, పాఠశాలల, వసతిగృహాల డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపును హర్షం వ్యక్తంచేస్తూ శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ రైతుల సమావేశం

దహెగాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం గతంలో పనిచేసిన ఆదర్శరైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలో ఆదర్శరైతులను తిరిగి పునరుద్ధరిస్తామని తెలపడం సంతోష మన్నారు. త్వరలో ఆదర్శ రైతులను విధుల్లో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ రైతులు పోశన్న, నర్సయ్య, ప్రశాంత్, గజానన్, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

వాంకిడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గిరిజన బాలికలఆశ్రమోన్నత పాఠశాలలోని విద్యార్థినులు మూడు రోజుల నుంచి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురవుతున్నారు. బుధవారం ఉదయం దాదాపు 30మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా గురువారం సాయంత్రం మరోనలుగురికి వాంతులు, విరేచనాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మరో 11మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో నలుగురిని ఆసిఫాబాద్‌ప్రైవేట్‌వైద్యశాలకు ఏడుగురిని స్థానిక ప్రభుత్వవైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వాంతులు, విరేచనాలు కావడానికి ఇంకా కారణాలు తెలియరాలేదు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ తివారి

● ఇంటిముఖం పడుతున్న విద్యార్థినులు..

అస్వస్థతకు గురవుతున్న విద్యార్థినులసంఖ్య పెరుగుతుండడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలకు వచ్చి పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లారు.

● విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలి..

అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైనవైద్యం అందించాలని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి వైద్యాధికారులను, సిబ్బందినిఆదేశించారు. గురువారం గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను, ప్రభుత్వవైద్యశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న వైద్యం, చికిత్సతదితరాలపై అడిగితెలుసుకున్నారు. పాఠశాలలో వంటశాల, ఆహారం, తాగునీటివసతిని పరిశీలించారు. వంటసామగ్రిని ఎప్పటికప్పుడు శుభ్రంగా కడిగి వండాలన్నారు.

నేడు కులగణనపై సమావేశం

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోజ్‌గార్డెన్‌లో శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోయే కులగణన కార్యక్రమంలో భాగంగా అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, కులసంఘాలు, విద్యార్థి, యువజనసంఘాల కార్యకర్తలకు నాయకుల సూచనలపై సమగ్రచర్చ జరపడానికి సమావేశం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రాద్‌రావు తెలిపారు. ఈ సమావేశానికి అందరూ హాజరై విజయంతం చేయాలని కోరారు.

నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

● డీవైఎఫ్ఐ నాయకులు

వాంకిడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆశ్రమ గిరిజనపాఠశాలలో 30మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనా ఇప్పటివరకు డీటీడీవో, ఐటీడీఏ పీవో స్పందించకపోవడం చూస్తే విద్యార్థులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలుస్తోందని డీవైఎఫ్ఐ నాయకులు అన్నారు. ఈ విషయాన్ని హాస్టల్ సందర్శనకు వచ్చి న అదనపుకలెక్టర్ దీపక్‌తివారి దృష్టికి తీసుకుపోయారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సతీష్, శ్రావణి, నిఖిల్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 2 నుంచి 4వరకు జిల్లాకేంద్రంలో జరగనున్న 38వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు పట్టణంలోని ఎస్టీమేరీ హైస్కూల్ పాఠశాలకు చెందిన అడప శాశ్విత, హిమబిందు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ లిబిస్, కరస్పాండెంట్ అని మాథ్యు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీడీ రాకేష్, పీఈటీ కిరణ్, అర్చన కుమారి, బద్రి తదితరులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

సిర్పూర్(యు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పోలీసుఅమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిర్పూర్(యు) పోలీసు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో క్యాండిల్ ర్యాలీనిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణారావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తారన్నారు. ఈసందర్భంగా అమరులైన పోలీసులకు నివాళ్ళుర్పించారు. కార్యక్రమంలోగ్రామపటేల్‌మోతీరాం,హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, కమలకార్, సంజీవ్, రాంచందర్, రాము గ్రామస్తులు పాల్గొన్నారు.



సిర్పూర్(యు)లో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు,గ్రామస్థులు

ఘనంగా సమైక్యతా దినోత్సవం

హాజీపూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుడిపేట 13వ బెటాలియన్‌లో గురువారం దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. బెటాలియన్ కమాండెంటెంట్ వెంకటరాములు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది చేత జాతీయ ఐక్యత దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఐక్యతతో ముందుకు సాగాలని మహాత్మాజ్యోతిబాపూలే ప్రిన్సిపాల్ రజిత పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అందరు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సమైక్యతకు పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు.

కేకే ఫైర్ వర్క్స్‌పై అధికారుల ఆరా

మందమర్రి టౌన్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులిమడుగు బొక్కలగుట్ట సమీపంలో రాష్ట్రీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన కేకే ఫైర్ వర్క్స్ నిర్వాహకుల లైసెన్స్ పై హైవే అథారిటీ పెట్రోలింగ్ అధికారులు గురువారం ఆరా తీశారు. రోడ్డు పక్కనే విక్రయిస్తే ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు. లైసెన్సు చూపించమనడంతో దాటవేశారు. రెండు రోజుల గడువు ఇవ్వాలని కోరారు. లైసెన్స్ చూపకుంటే దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

108 మంజూరుపై హర్షం

భీమారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండలానికి 108 అంబులెన్స్‌ను కేటాయించడం హర్షణీయమని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మండలంలో ఆరోగ్య కేంద్రం, అంబులెన్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురువారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి క్యాంపు కార్యాలయంలో మండలానికి అంబులెన్స్ కేటాయిస్తూ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. చేకుర్తి సత్యనారాయణరెడ్డి, అమర్‌సింగ్, రవి, కోట రమేష్, రాజం పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి

- ప్రతియేటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల తరువాత రాబడి
- రెబ్బెన, భీమినిమండలాల్లో ఆయిల్‌పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు


కెరమెరిలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంట

కెరమెరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి, పత్తి పంటకు ప్రత్యామ్నాయం వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలిచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 186 మంది రైతులు 1322 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా హార్టికల్చర్ శాఖా ధికారులు, మ్యాట్రిక్స్ ఆయిల్ పామ్ సంయుక్తంగా రైతులకు సహకారం అందిస్తున్నారు. భూమి ఉండి బోరుబావి లేదా వ్యవసాయ బావి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగుకు అర్హులు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న వారిలో జాబ్‌కార్డు కలిగి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం, ఆయిల్ పామ్ మొక్కలు నాటడం లాంటి పనులు చేయిస్తారు.

తక్కువ పెట్టుబడితో..

ఆయిల్ పామ్ సాగుకు ఖర్చు చాలా తక్కువ. ఎకరాకు 57 మొక్కలు నాటాలి. ఇందుకు రూ.1.50లక్షలు మొక్కలకు, రూ.15 వేలు పాదులు తవ్వేందుకు, రూ.10వేలు ఎరువులకు ఇతర ఖర్చులతో మొత్తం ఎకరానికి రూ.2లక్షల వరకు ఖర్చు వస్తుంది. జాబ్‌కార్డు కలిగి ఉన్న రైతులకు ఈజీఎస్ పథకంలో మొదటి ఏడాది ఎకరానికి రూ.33వేల చొప్పున రెండు, మూడు సంవత్సరాలు రూ.13 వేల చొప్పున చేయూత అందిస్తారు. హార్టికల్చర్ అధికారులు రూ.4200ఎకరానికి చేయూత అందచేస్తారు. అలాగే స్వంత వ్యవ సాయ భూమి కలిగిన రైతులకు ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీపై, బీసీ చిన్న,సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీపై, ఇతరు లకు 80శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేస్తారు.

పామ్ సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన మూడు, నాలుగేళ్ల పంట చేతికి వచ్చే అవకాశముంది. నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటగా పత్తి, మిర్చి, వంకాయ, ఇతర పంటలు వేసుకోవచ్చు.

జిల్లాలో సాగు విస్తీర్ణం..

మండలం	ఎకరాల్లో...
కాగజ్‌నగర్	225
చింతలమానేపల్లి	163
దహెగాం	83
రెబ్బెన	78
కెరమెరి	26
ఆసిఫాబాద్	42
కౌటాల	34

అధికారుల ప్రోత్సాహం..

జిల్లాలో వరి, పత్తికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని అధికారులు పలు సందర్భాలలో రైతుల తో నిర్వహించిన సమావేశాల్లో పేర్కొన్నారు. గ్రామ సభల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మ్యాట్రిక్స్ ఆయిల్ పామ్ సంస్థ, ఉద్యానవన అధికా రులు రైతులకు అండగా నిలిచారు. దీంతో రైతులు ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కెరమెరి మం డలంలోని అనార్‌పల్లి, దేవాపూర్ గ్రామాలతోపాటు జిల్లా వ్యాప్తంగా రైతులు ఆయిల్

పంట అమ్మకం ఇలా..

నాలుగు సంవత్సరాల తర్వాత మొక్కలు గెలలు వేస్తాయి. ఎకరాకు రెండు టన్నుల పంట దిగు బడి వస్తుంది. పంటచేతికి రాగానే మ్యాట్రిక్స్ సం స్థ ప్రతినిధులు రైతుల వద్దకు వచ్చి ఆయిల్ పామ్ గింజలను కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ ధర రూ.1600నుంచి రూ.2000 వరకు ఉంది. అలాగే ప్రతిపదిహేను రోజులకు ఒక రాసి పంట వస్తుంది. దీంతో ఎకరానికి రూ.40 వేల వరకు రైతులకు ఆదాయం సమకూరుతుంది.

రైతులను ప్రోత్సహిస్తున్నాం..

నదీం, జిల్లా ఉద్యానవనాధికారి



ఆయిల్‌పామ్ సాగుకోసం రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఎప్పటి కప్పుడు సాగుపై సూచనలు అందజేస్తున్నాం. డ్రిప్‌పరికాలు, ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు సబ్సిడీపై అందజేస్తున్నాం. ఈ సాగులో రైతులకు అనేక లాభాలు ఉన్నాయి. జిల్లా రైతులు పత్తి, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్‌సాగు చేయాలి.

ప్రభుత్వం ప్రోత్సాహకం పెంచాలి

కేంద్రె బాలాజీ, రైతు, ధనోర



ప్రభుత్వం ఆయిల్ పామ్‌సాగు రైతులకు ప్రస్తుతం ఎకరానికి రూ.4వేలు మాత్రమే అందజేస్తోంది. ఇది రైతులకు ఏ మాత్రం లాభ సాటిగా లేదు. ప్రోత్సాహకాన్ని రూ.8వేలు అందజేయాలి.

క్రైం కార్నర్

పండుగ పూట విషాదం

- గోదావరి స్నానానికి వెళ్లి ఇద్దరు విద్యార్థులు
- పిడుగుపాటుకు మహిళా కూలీ మృతి

మంచిర్యాల జిల్లాలో దీపావళి పండుగ పూట విషాదం నెలకొంది. చెన్నూరు మండలం దుగ్నేపల్లికి చెందిన ఇద్దరు స్నేహితులు గోదావరి స్నానానికి వెళ్ళి మృతి చెందారు. అలాగే దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో పిడుగు పాటుకు మహిళా కూలీ మృతి చెందడంతో విషాదం నెలకొంది.


మృతి చెందిన కొండ అరుణ్, దాసరి సాయి (ఫైల్)

చెన్నూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన కొండ అరుణ్ (19), దాసరి సాయి(16) అనే విద్యార్థులు సుందరసాల వద్ద గోదావరి నదిలో ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందారు. దుగ్నేపల్లికి చెందిన కొండ పోచయ్య శోభలు చెన్నూరులో ఉంటున్నారు. వీరి కుమారుడు అరుణ్ కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అలాగే దాసరి కృష్ణ-మధులతలు రామగుండంలో ఉంటుండగా వీరి కుమారుడు దాసరి సాయి కరీంనగర్‌లోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. వీరు గురువారం దీపావళి పండుగ సందర్భంగా స్వగ్రామమైన దుగ్నేపల్లికి వచ్చారు. శుక్రవారం అరుణ్, సాయితోపాటు మరో ముగ్గురు స్నేహితులతో కలిసి సుందరసాల గ్రామంలోని గోదావరి నదికి స్నానానికి వెళ్లారు. అన్నారం బ్యారేజీ గేట్లు తీసి ఉండడంతో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. వీరు ఈత కొడుతూ గల్లం తయ్యారు. మిగితా స్నేహితులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెన్నూరు సీఐ రవీందర్, ఎస్ఐ సుబ్బారావులు సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా మృతదేహాలు లభ్యమయ్యాయి. పండగ పూట రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

పిడుగుపాటుకు మహిళా కూలీ మృతి


నాగమ్మ(ఫైల్)

దండేపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కొత్తమామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దమ్మనపేట గ్రామంలో గడ్డం నాగమ్మ (నాగలక్ష్మి) (26) పిడుగుపాటుతో మృతి చెందింది. గురువారం ఉదయం కౌలుకు తీసుకున్న పత్తి చేనులో భర్త ప్రశాంత్‌తో కలిసి పత్తి ఏరడానికి వెళ్లింది. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురువడంతో చేను సమీపంలో ఉన్న చెట్టు కింది నిలుచుంది. చెట్టుపై పిడుగు వేయడంతో ఆమె స్పృహ తప్పిపడిపోయింది. కొంత దూరంలో ఉన్న భర్త ప్రశాంత్ గమనించి అపస్మారక స్థితిలో ఉన్న నాగమ్మను 108 అంబులెన్స్‌లో మ్యాదరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించేలోపే ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి భర్త ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

విచారణ నిమిత్తం పిలిచి చితకబాదిన ఎస్సై


చికిత్స పొందుతున్న బాపురావు

దహెగాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం అయినం గ్రామానికి చెందిన వెల్ముల బాపు రావును ఓ కేసులో విచారణ నిమిత్తం పోలీసుస్టేషన్‌కు రావాలని ఎస్సై పిలిచాడు. బాపు పోలీసుస్టేషన్‌కు చేరు కున్న వెంటనే పశువులను గొడ్డలితో నరికావా అని ప్రశ్నిస్తూ ఎస్సై అతన్ని చితకబాదాడు. దీంతో బాపు స్పృహతప్పి కిందపడిపోయాడు. వెంటనే పోలీసులు అతనికి స్థానికంగా వైద్యం అందించారు. అయినా అతడు స్పృహలోకి రాలేదు. అదే క్రమంలో బాపు భార్య సంగీత పోలీసు స్టేషన్‌కు చేరుకుని తన భర్తను చూపించాలని ఎస్సైని అడిగింది. మీ భర్త స్పృహ తప్పిపడిపోయాడని హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని ఎస్సై సూచించాడు. కానీ సంగీత భర్తను తీసుకెళ్లడానికి నిరాకరించింది. దీంతో పోలీసులే వారి వాహనంలో మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. శుక్రవారం బాధితుడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై రాజును ఫోన్‌లో సంప్రదించగా గురువారం అయినం గ్రామానికి చెందిన వెల్ముల బాపురావును పోలీసుస్టేషన్‌కు రావాలని, పశువులను గొడ్డలితో నరికినట్లు గ్రామస్థుల నుంచి ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. బాపురావును కొట్టారా అని ప్రశ్నించగా కావాలనే కొందరు వ్యక్తులు దుష్ప్రచారం చేస్తు న్నారని సమాధానం ఇచ్చారు. కాగా బాధితుడిని చితకబాదిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

జిల్లాలో అంబరాన్నంటిన దీపావళి సంబరాలు


పూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు


కాగజ్‌నగర్‌లో దుకాణాల ఎదుట బాణాసంచా కాల్చుతున్న వ్యాపారులు


ఆసిఫాబాద్‌లో కుటుంబసభ్యులతో కలిసి బాణాసంచా కాల్చుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం దీపావళి పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా తమతమ ఇళ్లలో, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో లక్ష్మీపూజలు నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా బాణాసంచా కాల్చారు. ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంతోపాటు 15మండలాల్లో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లాకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో అర్చకుడు మధుకర్‌శర్మ ఆధ్వర్యంలో లక్ష్మి పూజలు నిర్వహించారు.

కాగజ్‌నగర్: పట్టణంలో గురువారం దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఇంటి ఆవరణలో దీపాలను వెలిగించారు. అలాగే దుకాణాల వద్ద లక్ష్మీపూజలను చేశారు. అనంతరం పెద్ద ఎత్తున బాణ సంచాను కాల్చారు. వివిధకాలనీలో ఇండ్లకు విద్యుత్‌దీపాలను అలకరించారు. అనంతరం మిఠాయి పంచుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే హరీష్ బాబు దీపావళి వేడుకల్లో పాల్గొని బాణాసంచాలను కాల్చారు.

రెబ్బెన/బెజ్జూరు/పెంచికలపేట/చింతలమానేపల్లి/సిర్పూర్(టి)/కెరమెరి/సిర్పూర్(యు)/జైనూర్/కౌటాల/దహెగాం/వాంకిడి: మండలాల్లో గురువారం దీపావళిపండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నపెద్ద తేడాలేకుండా బాణాసంచా కాల్చారు. వ్యాపారులు లక్ష్మీపూజలు నిర్వహించారు. శుక్రవారం ఇళ్లలో కేదారేశ్వరవ్రతాన్ని(నోము) నిర్వహించారు. సిర్పూర్(టి) మండలకేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ డీలర్ కుర్షిద్‌హుస్సేన్ దీపం కనెక్షన్ లబ్దిదారులతోపాటు పలువురిని ఆహ్వానించి మిఠాయిలు పంపిణీ చేశారు. జైనూర్‌లోబౌద్ధులు పెద్ద ఎత్తున దీపారాధన చేసి గౌతమ బుద్ధుడి చిత్రపటానికి మొక్కుకున్నారు. ఆదివాసులు గ్రామగ్రామాన దండారి సంబరాలు వైభవంగా జరుపుకున్నారు. మహిళలు రెలరెలా పాటలు పాడుతు నృత్యాలు చేశారు. అదేవిధంగా ఏత్మసర్ దేవతను మొక్కుకున్నారు. ఆనంతరం గ్రామస్థులందరు సాముహిక భోజనాలు చేశారు. రెబ్బెన మండలంలో మహిళలు ఇంటిముందు అందంగా దీపాలను అలంకరించారు. ఈ సందర్భంగా పూజ కార్యక్రమాలను నిర్వహించి పెద్ద ఎత్తున బాణాసంచాను కాల్చారు. అలాగే వ్యాపార సంస్థల్లో లక్ష్మి పూజలను నిర్వహించారు. దీపావళి పండగ సందర్భంగా టపాసుల దుకాణాలు ప్రజలతో కిటకిటలాడాయి.

సిర్పూర్(యు) మండ లంలోని ఆయాగ్రామాల్లో శుక్రవారం దీపావళి పండుగలో భాగంగా గోవుపూజలు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీలు దీపావళి పండుగను పురస్కరించుకొని గోవు పూజలు నిర్వహించడం సంప్రదాయం. ఈ సందర్భంగా ఆదివాసీలు గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం తినిపించారు. అందరూ సుఖశాంతులతో ఉండాలని మొక్కుకున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు: ఎస్సై


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్సై కొమురయ్య

పెంచికలపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వలభవిష్యత్ ఉంటుందని ఎస్సై కొమురయ్య అన్నారు. మండలంలోని గుంట్లపేటలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగింపులో పాల్గొని విజేతలకు నియోజకవర్గకన్వీనర్ శ్యాంరావుతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతక్రీడల్లో గెలుపుఓటములను సమానంగా స్వీకరించి స్వీయ క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మోహిన్, మనోహర్, నరేందర్, చంద్రమౌళి, శేఖర్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటింటి సర్వే

బెజ్జూరు/చింతలమానేపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల6నుంచి ప్రారంభమయ్యే కులగణనలో భాగంగా శుక్రవారంనుంచి మండలాల్లో ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవోలు మాట్లాడుతూ మండలంలో కులగణన చేపట్టేందుకు మండలవ్యాప్తంగా 1నుంచి5వరకు ఇంటింటిసర్వే కొనసాగుతోందని, ఈసర్వేలో ఒక్కగ్రామంలో ఎన్నిళ్లు ఉన్నాయనిదానిపై సర్వే చేపడుతు న్నామ న్నారు. ఇళ్ల సంఖ్య గుర్తింపు ఆధారంగా కులగణన సర్వేకు ఎన్నిఫారంలు అవసరం ఉంటాయో తెలుసుకునేందుకు సర్వే చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఇల్లు తప్పిపోకుండా సర్వే నిర్వహించాలి

సిర్పూర్(టి): ఒక్కఇల్లుతప్పిపోకుండా సమగ్రసర్వే నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శుక్ర వారం ప్రారంభమైన సర్వేను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ సర్వేలో అన్ని వివరాలు నమోదుచేయాలని, సర్వేచేసిన ఇంటికిస్టిక్కర్‌ను అంటించాలన్నారు. ఒక్కఇల్లు తప్పిపోయినా ఎన్యూమరేటర్లదే బాధ్యత అని అన్నారు.

సెల్‌ఫోన్‌ల అందజేత

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను శుక్రవారం సీఐ బుద్దేరవీందర్ బాధితులకు అంద జేశారు. పట్టణానికి చెందిన శ్రీకాంత్, సీహెచ్ చంద్రశేఖర్, మీర్జా ఎజాజ్‌బేగ్ ఫోన్‌లు పోగా ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. సీఈఐఆర్‌పోర్టల్‌ద్వారా వాటిని రివకరీ చేసినట్లు సీఐ తెలిపారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ఆసిఫాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలో శుక్రవారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, మాలశ్రీ, నిఖిల్, శ్రావణి, సతీష్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరులు పద్ధతులు మార్చుకోవాలి

-లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవు

-మావోయిస్టు కార్యదర్శి ప్రభాత్ హెచ్చరిక

మంచిర్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏతోపాటు అనుచరులు ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పద్ధతులు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎమ్మెల్యే పీఏ ప్రసాద్‌తోపాటు వినోద్ బినామీలుగా వ్యవహరిస్తున్న బండి ప్రభాకర్, వెంకటస్వామి, నాథరి స్వామి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య, రాంనగర్ శ్యాం, సన్నిబాబులు గూండాయిజం, భూకబ్జాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నుంచి వలస వచ్చిన వారంతా ఎమ్మెల్యే వినోద్ ముఠాగా ఏర్పడి చెరువులు, కుంటలు, ప్రభుత్వ సింగరేణి భూముల కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గతంలో చిన్నయ్య హయాంలో చేసిన అరాచకాలు, దందాలు ప్రస్తుత ఎమ్మెల్యే వినోద్ అండతో కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు వినోద్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మంత్రి శ్రీధర్‌బాబు అనుచరులమని చెప్పుకుంటూ మాఫియాగా ఏర్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యే తోపాటు అతని పీఏకు, పోలీసు అధికారులకు డబ్బు, మద్యం, అమ్మాయిలను సరఫరా చేస్తున్నారని, పట్టణంలో గంజాయి, డ్రగ్స్, తదితర మాదక ద్రవ్యాలకు అలవాటుపడి, యువతను జులాయిలుగా తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. దుర్గం చిన్నయ్య పెంచి పోషించిన లంపెన్ గ్యాంగులను, చిన్నయ్య బాధితురాలు శేజల్‌పై భౌతిక దాడికి పాల్పడ్డ గూండాలను వినోద్ పార్టీలో చేర్చుకొని ప్రజలపై అరాచకాలకు ఉసిగొల్పుతున్నాడని ఆరోపించారు. వారంతా ఇప్పటికైనా తమ పద్ధతులు మార్చుకోవాలని, లేనట్లయితే వారికి ప్రజల చేతుల్లో శిక్షలు తప్పవని హెచ్చరిచారు. బెల్లంపల్లిలో జరిగే భూకబ్జాలు, అరాచకాలు ఎమ్మెల్యే వినోద్, ఆయన పీఏ ప్రసాద్‌లే బాధ్యులవుతారని పేర్కొన్నారు. కబ్జాలకు గురవుతున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిరుపేదలకు, హమాలీ, వ్యవసాయ, రైతు కూలీలకు పంచాలని, ఇందుకు కలెక్టర్ చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేసి హక్కులను సాధించిందన్నారు. ముంబైలోని ఎయిర్‌పోర్టు కోసం రూ.12,770 కోట్లను దీపావళి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అదానికి రుణమాఫీ చేసిందని,కార్మిక వర్గానికి కనీస వేతనాలు పెంచకుండా మోసం చేస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించే ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడానికి ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జిల్లా కార్యదర్శి కలీందర్‌ఆలీఖాన్, రామన్న, మహేష్, రాయమల్లు,మధు, పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. సివిల్ సప్లయి హమాలీ కార్మిక సంఘం నాయకులు భైరి రాజన్నజెండాను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు సత్తన్న, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్పీ 3 గని మేనేజర్‌కు సన్మానం


మేనేజర్‌ను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్పీ3 గని మేనేజర్‌గా పనిచేస్తున్న వెంకట్రావుకు ఎస్ఓఎంగా పదోన్నతి రావడంతో ఆయనను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా యూనియన్ ఉప ప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య హాజరై మాట్లాడారు. వెంకట్రావు ఎంతో శ్రమించే వ్యక్తి అని, ఆయనకు పదోన్నతి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయకార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పిట్ కార్యదర్శి మురళీచౌదరి, మైన్స్‌కమిటీ, రక్షణకమిటీ, ఆలయకమిటీ, క్యాంటీన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ జీఎంగా సూర్యనారాయణ


సూర్యనారాయణ

శ్రీరాంపూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ నూతన జీఎంగా ఎల్‌వి సూర్యనారాయణ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆయన ఆర్‌జీ-2 జీఎంగా పని చేస్తున్నారు. గతనెల30న జీఎం బి సంజీవరెడ్డి రిటైర్ అయ్యారు. ఆయన స్థానంలో సూర్యనారాయణను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అలాగే మందమర్రి ఎస్ఓటు జీఎంగా పనిచేస్తున్న రాజేశ్వర్ రెడ్డిని పదోన్నతిపై భూపాలపల్లి ఏరియా జీఎంగా, కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ జీఎంగా పనిచేస్తున్న సుశాంత్ సాహను బెల్లంపల్లి క్వాలిటీ జీఎంగా నియమించారు.

యాజమాన్యం సొంతింటి పథకానికి చొరవ చూపాలి: ఐఎన్‌టీయూసీ

మందమర్రి టౌన్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల సొంతింటి పథకానికి యాజమాన్యం చొరవచూపాలని, త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి నివేదిక ఇస్తామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మందమర్రిలో మాట్లాడుతూ ఎన్నికల సందర్బంలో కార్మికులకు అనేక హామీలు ఇచ్చి గెలిచిన ఏఐటీయూసీ వాటిని అమలు చేయాలని తెలిపారు. సంస్థకు ప్రభుత్వ చేయూత ఉంటుందని చెప్పారు. మందమర్రి ఏరియాకు సంబంధించి బ్లాకులను యాజమాన్యానికి కేటాయించాలన్నారు. నూతన గనులపై ప్రత్యేకదృష్టి పెట్టిందన్నారు. రానున్న రోజుల్లో బొగ్గు నిక్షేపాలు మూతపడనున్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో కూడా బొగ్గుపరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టిందని, అదేవిధంగా భవిష్యత్ ఉద్యోగ ఉపాధి నిమిత్తం ఇతర ఉపాధి పరిశ్రమలను కూడా అన్వేషించి వాటి ఏర్పాటుకు కూడా కృషి చేయాలని ఆయన కోరారు.

బెల్లంపల్లి ఏరియాలో 79 శాతం ఉత్పత్తి

రెబ్బెన, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్ కాస్టు ద్వారా అక్టోబరులో 79శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గోలేటి జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖైరిగూడ ఓపెన్‌కాస్టు ద్వారా 2,40,000 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాల్సి ఉండగా, 1,89,000టన్నులతో 79శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. సమావేశంలో పర్సనల్ మేనేజర్ ఆర్ తిరుపతి, ఐఈడీ ఉజ్వల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముల్కలపేట 11కేవీ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ దీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ముల్కలపేట, కేతనపల్లి, కల్మలపేట, రాచర్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ మాజీ ప్రధాన కార్యదర్శి తలారి రాజు, నాయకుడు గరిగంటి రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందన్నారు.

హౌస్ వైరింగ్ ఉచిత శిక్షణ

నస్పూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్), డీడీయు, జీకేవై ఆధ్వర్యంలో నస్పూర్‌లోని కార్యాలయంలో నిరుద్యోగ యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌పై మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ నిర్వహణ అధికారి రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ లోగా 18 -35 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేయాలన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. అభ్యర్థులు రేషన్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, స్టడీ సర్టిఫికెట్లు, రెండు ఫొటోలతో సంప్రదించాలన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

జన్నారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటు నమోదు చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ సతీష్, కళాకారులు రమేష్, మురళీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ జడ్పీటీసీ

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మాజీ జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనకు కండువాలు కప్పి ఆహ్వానించారు. శ్రీనివాస్, చిన్నయ్యనరేష్, తిరుపతి పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా ఆనంద నిలయం



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆనంద నిలయం ఆశ్రమం

- వృద్ధులు, పిల్లలకు ఆశ్రయం
- అక్కున చేర్చుకుంటున్న రెడ్‌క్రాస్ సొసైటీ

ముగ్గురు కూతుళ్ళు ఉన్నా ఎవరూ చేరదీయకపోవడంతో భిక్షాటన చేస్తున్న వృద్ధురాలు... సంతానం లేకపోవడం, భర్త మృతి చెందడంతో ఒంటరైన మహిళ... ఉపాధి కోల్పోవడం, దుర్భరస్థితిలో దంపతులు... ఇలా ఎంతో మందిని అక్కున చేర్చుకుంటోంది ఆనంద నిలయం. ఒంటరి పిల్లలు, అనాథలైన చిన్నారులు, వృద్ధులను ఆదరిస్తోంది... దాతల సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీతో నడుస్తున్న 'ఆనంద నిలయం'పై ప్రత్యేక కథనం...

గర్మిళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని తోళ్లవాగు సున్నంబట్టివాడలో ఉన్న ఆనంద నిలయం ఆశ్రమం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తోంది. 2009 నవంబర్ 15న శ్రీశ్రీ నగర్‌లో అప్పటి కలెక్టర్ అహ్మద్ నదీమ్ ప్రారంభించారు. ఆశ్రమంలో 50 మంది ఉంటున్నారు. వీరిలో 18 మంది పిల్లలు సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదువుతున్నారు. వీరికి బస్సు సౌకర్యంతో పాటు స్కూలు ఫీజులను దాతల సహకారంతో అందిస్తున్నారు.

2009లో పిల్లల కోసం ప్రారంభమైన ఈ ఆశ్రమంలో 2012లో పెద్ద వాళ్లను చేర్చుకుంటున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు 2018 వరకు దుస్తులు, పుస్తకాలు, తదితర వస్తువులు అందించారు. దాతల సహకారంతో వస్తువులు, సరుకులు, పిల్లలకు దుస్తులు, పుస్తకాలు అందిస్తున్నారు. ఆశ్రమంలోని వారికి బ్రేక్‌ఫాస్ట్‌లో చపాతి, పూరి, ఇడ్లీ, వడ, దోశ, అటుకులు ఇస్తున్నారు. ఆశ్రమంలోని వారికి అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు కొందరు వైద్యులు స్వచ్ఛందంగా పరీక్షలు చేసి మందులను అందజేస్తారు. ఆశ్రమం ఇన్‌చార్జీలు సదానందం- తిరుమల దంపతులకు రెడ్‌క్రాస్ సొసైటి సంస్థ నెలకు రూ. 30 వేల వేతనం అందిస్తుంది.



"ఉన్న ఒక్క కొడుకు 20 సంవత్సరాల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. కోడలితో గొడవలు జరుగుతుండడంతో మేము ఇద్దరం బయటకు వచ్చాం. హోటల్‌లో పనిచేసుకుంటూ అక్కడే ఉండేవాళ్లం. ఒక్కొక్కరికి రూ.4 వేల జీతం వచ్చేది. కరోనా టైంలో హోటల్ నడవకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉండడానికి, తినడానికి ఏమి దొరకని పరిస్థితి ఏర్పడింది. మంచిర్యాలకు చెందిన కౌన్సిలర్‌కు మా పరిస్థితి వివరించగా ఆయన ఆనంద నిలయం ఆశ్రమంలో చేర్పించారు. 5 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్నాం. మా కోడలు మంచిర్యాలలోని ఒక కంగన్ హాలులో పనిచేస్తుంది. మాకు రూ.4 వేల పింఛన్ వస్తుంది. పింఛన్ తీసుకోవడానికి వెళ్లినప్పుడు కొడుకు గురించి అడిగితే తెలియదని చెబుతోంది. ఆశ్రమంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

- అల్లాడి నారాయణ- సరోజ, పెర్కపల్లి, బెల్లంపల్లి.



- మందమర్రి పట్టణంలోని శ్రీపతినగర్ నాది. భర్త మద్యం సీసాలు అమ్ముకుంటూ పోషించేవాడు. మాకు పిల్లలు పుట్టలేదు. పది సంవత్సరాల కిత్రం నా భర్త చనిపోయాడు. తర్వాత నా మేనల్లుళ్లు ఆనంద నిలయం ఆశ్రమంలో చేర్పించి వెళ్లిపోయారు. 8 సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నా. అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రికి లేదా డాక్టర్‌ను ఆశ్రమానికి పిలిచి వైద్యం చేయిస్తారు.

- నాగుల మల్లమ్మ



- నాకు ఇప్పుడు 80 సంవత్సరాలు. అమ్మ చిన్నతనంలోనే మృతి చెందగా మేనత్త పెంచి పోషించింది. నాకు పెళ్లి అయిన రెండు సంవత్సరాలు నా భర్తతో ఉన్నాను. తర్వాత అత్తగారింటికి వెళ్లలేదు. భర్త అంటే ఇష్టం లేక ఒక్కదాన్నే ఉండిపోయాను. నాకు కాలు చెయ్యి విరిగితే మా అక్క కొడుకు, బిడ్డలు వైద్యం చేయించారు. వాళ్లు ఒక్కొక్కరు కొన్ని రోజులు చూసుకునేవారు. తర్వాత ఇక్కడ చేర్పించి వెళ్లారు. అప్పుడప్పుడు చూడడానికి వస్తారు.

- నరెడ్ల అమృత



మాది సిరిసిల్ల. నాకు ముగ్గురు కూతుళ్లు. నేను గ్రామాల్లో బోళ్లు, గంజులు అమ్ముకుంటూ వచ్చిన డబ్బులతో కూతుళ్ల పెళ్లిళ్లు చేశాను. నా భర్త చనిపోయాడు. నన్ను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఏమి చేయాలో తోచలేదు. ఉన్న ఊళ్లో ఉండలేక మంచిర్యాలకు వచ్చా. సాయిబాబా గుడి దగ్గర భిక్షాటన చేస్తూ జీవించేదాన్ని. ఒక రోజు ఆనంద నిలయం ఇన్‌చార్జీ గుడికి వస్తే ఆయనను భిక్షం అడగగా ఆశ్రమానికి రమ్మన్నాడు. పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి చెప్పగా కానిస్టేబుళ్లు వచ్చి ఆశ్రమంలో చేర్పించారు. నేను ఆశ్రమంలో చేరి పది సంవత్సరాలు అవుతోంది." **- మిట్టపల్లి చంద్రకళ**


ఆశ్రమంలో భోజనం చేస్తున్న వృద్ధులు, పిల్లలు

సేవ చేయడం సంతోషంగా ఉంది: సదానందం-తిరుమల,ఆశ్రమం ఇన్‌చార్జిలు



రెడ్‌క్రాస్ సొసైటీ ఆనంద నిలయం ఆశ్రమం 2009లో ప్రారంభమైనప్పటి నుంచి ఇక్కడ పనిచేస్తున్నాం. వృద్ధులు, పిల్లల బాగోగులు చూసుకోవడం ఆనందంగా ఉంటుంది. వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నాం. పిల్లలు చదువుకుంటున్నారు. వృద్ధులు, పిల్లలకు సేవ చేయడం సంతోషంగా ఉంది.

దాతలు సహాయం చేయాలి భాస్కర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్



దాతలకు ముందుకు వచ్చి వృద్ధులు, పిల్లలకు సహాయ సహకారాలు అందించాలి. అనాథ పిల్లలను, వృద్ధులను తీసుకువస్తే ఆశ్రమంలో చేర్పించుకుంటాం. దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తే మరిన్ని సౌకర్యాలను కల్పిస్తాం.

మరిగిన నూనెతో ముప్పు

- ప్రజల ప్రాణాలతో వ్యాపారుల చెలగాటం
- పదేపదే మరిగించిన నూనెతో ఆహారపదార్థాలు తయారీ
- జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం

మంచిర్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదే పదే వాడిన నూనెతో తయారైన ఆహార పదార్థాలను తినడం హానికరమని వైద్యులు పేర్కొంటున్నారు. మరిగిన నూనెతో వండిన వంటకాలు తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వంట నూనెలను పదేపదే వేడి చేయడం వల్ల కార్బన్ విడుదల అవుతుందని, అది శరీరానికి హాని చేస్తుందని చెబుతున్నారు. కడుపు, అన్నవాహికకు క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని, ఆరోగ్యానికి ముప్పు నెలకొందనే హెచ్చరిస్తున్నారు.

గ్యాస్ట్రిక్ సమస్యలు...

మరిగిన నూనెలతో తయారు చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్య ఉత్పన్నం కావడంతోపాటు కడుపులో అల్సర్లు, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తుతాయి. పదే పదే మరిగించిన నూనెతో వండిన పదార్థాలు తినడం వల్ల పిల్లల్లో ఒబెసిటీ, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టీపీసీ మీటర్స్‌తో నిర్ధారణ....

వంట నూనెను ఎన్నిసార్లు వినియోగించారనే విషయాన్ని ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు నిర్ధారిస్తారు. టోటల్ పోలార్ కాంపౌండ్ (టీపీసీ) మీటర్ వినియోగిస్తారు. ఈ పరికరాలను వినియోగించి అధికారులు నూనెలను ఎన్నిసార్లు, ఎంత సమయం మరిగించారో నిర్ధారిస్తారు. మరుగుతున్న నూనెలో ముంచిన వెంటనే టీపీసీ పర్సంటేజీ తెలుస్తుంది. సాధారణంగా ఐదు నుంచి ఎనిమిది శాతం మాత్రమే రీడింగ్ ఉండాలి. ఒకటి కంటే ఎక్కువసార్లు ఆయిల్ వినియోగిస్తే ఆ సంఖ్య 35 నుంచి 40 శాతం వరకు పెరుగుతుంది. ఈ విధంగా టీపీసీ విలువ పెరిగితే ప్రమాదకరమని నిపుణులు పేర్కొంటున్నారు. తనిఖీల్లో టీపీసీ పర్సంటేజీ కౌంట్ ఎనిమిది శాతం కంటే ఎక్కువ ఉంటే సంబంధింత వ్యాపారులకు జరిమానా విధించడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. అయితే జిల్లాలో ఈ తరహా తనిఖీలు చేపడుతున్న దాఖలాలు లేవు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరిగించిన ఆయిల్‌ను మళ్లీ వినియోగించడం పరిపాటిగా మారింది.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వ్యాపారాలు...

ప్రస్తుతం బయట చిరుతిళ్లు తినడం ఫ్యాషన్‌గా మారింది. బండ్లపై తయారు చేసే మిర్చి, పానీపూరీ, తదితర ఆహార పదార్థాలను ప్రజలు వినియోగిస్తున్నారు. వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. గల్లీకో బండి ఏర్పాటు చేస్తూ ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఆహార పదార్థాలు తయారు చేస్తూ ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో తోపుడు బండ్లు ఏర్పాటు చేసి ఆహార పదార్థాలు తయారు చేస్తున్నా అడిగేవారు కరువయ్యారు.

బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి

మరిగించిన నూనెలో వండిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల శరీరంలోని కొవ్వుశాతంలో తేడా వస్తుంది. కొన్నిరకాల రసాయనాలు విడుదలై క్యాన్సర్‌కు దారితీస్తాయి. మరిగిన నూనెలో ఉండే కార్బన్‌తో అన్నవాహిక క్యాన్సర్‌కు కారణమవుతుంది.

బిల్ల వికాస్, ఎండీ, జనరల్ ఫిజీషియన్, మంచిర్యాల

ఘనంగా కాళీమాతకు పూజలు


కాళీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

మందమర్రిరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలోని కాళీనగర్ (పాకిస్తాన్ క్యాంపు)లో కాళీమాతకు బెంగాలీలు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. యేటా దీపావళిని పురస్కరించుకుని కాళీమాతకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గురువారం రాత్రి ప్రారంభమైన పూజలు మూడు రోజుల పాటు కొనసాగుతాయి. మహిళలు ఉపవాసం ఉంటూ పూజలు నిర్వహిస్తారు. 1970లో సింగరేణిలో ఉద్యోగాల కోసం ఇక్కడకు వచ్చి స్థిరపడిన బెంగాలీ కుటుంబాల ప్రజలు కాళీమాతకు పూజలు చేస్తున్నారు. మహారాష్ట్ర, చంద్రపూర్, ముంబై, భూపాలపల్లి, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు వస్తుంటారు. కోరిన కోర్కెలు తీర్చే దేవతగా కాళీమాతను పూజిస్తారు. శనివారం అన్నదానం నిర్వహిస్తారు. ఆదివారం కాళీమాత శోభాయాత్ర నిర్వహించి గోదావరిలో నిమజ్జనం చేయనున్నారు.

నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తా


చెన్నూరులో అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చెన్నూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. గురువారం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండు 108 అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో రెండు అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కోటపల్లి, భీమారం మండలానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనగిల్డా, ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి గురువారం ఉదయం పలు కాలనీల్లో మార్నింగ్ వాక్ చేశారు. పట్టణ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం రామన్ కాలనీ రైల్వే బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, రూ.300 కోట్లకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయన్నారు. మందమర్రి మున్సిపాలిటీని మెగా మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్, బండి సదానందం యాదవ్, దుర్గం నరేష్, పాల్గొన్నారు.

దేశంలో పేదల అభ్యున్నతికి పాటుపడిన నాయకురాలు ఇందిరాగాంధీ అని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాషా, మంద తిరుమల్ పాల్గొన్నారు.

ఫాదర్ థామస్ పుస్తకావిష్కరణ

ఫాదర్ థామస్ నిలయాని విద్యాభివృద్ధితోపాటు నిస్వార్థంగా ప్రజాసేవ చేశారని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. బొక్కలగుట్ట వద్ద సేంట్స్ అనాథ ఆశ్రయంలో సీనియర్ జర్నలిస్టు ఎండి మునీర్ రచించిన ఫాదర్ థామస్ 50 వసంతాలు పుస్తకావిష్కరణ, సిల్వర్ జూబ్లికి హాజరయ్యారు. ఈ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. అదే పాఠశాలకు చెందిన ఎండి మునీర్ పుస్తకాన్ని రాయడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం రహదారుల అభివృద్ధి



లక్షెట్టిపేటలో ఆసుపత్రి నిర్మాణ పనులను, హాజీపూర్‌లో బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం లక్షెట్టిపేట మండల పరిధిలో రహదారుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ముత్తబుచ్చయ్యపల్లి నుంచి రాజంపేట రోడ్డు (పీఎం జీఎస్‌వైరోడ్డు) వరకు, కొత్తూరు గ్రామంలో ఎన్‌హెచ్ 24 నుంచి చందారం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు కొత్తూరు మీదుగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కేంద్రానికి రహదారులను అనుసంధానం చేస్తున్నామన్నారు.

లక్షెట్టిపేట పట్టణంలో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి భవనం, సమీకృత మార్కెట్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి భవనం, సమీకృత మార్కెట్ భవన నిర్మాణాలను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేయకుండా త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు.

బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన

హాజీపూర్ (ఆంధ్రజ్యోతి): ముల్కల్ల, పెద్దంపేట, దొనబండ గ్రామాల్లో రూ.4.35 కోట్లతో బ్రిడ్జిల నిర్మాణానికి కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిడ్జిల నిర్మాణంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. చుట్టుపక్కల గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. వర్షాకాలంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో మల్లయ్య, పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, నాయకులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. గురువారం ముత్యంపేట నుంచి చింతపల్లి గుర్రాలబాట, చింతపల్లి నుంచి వెంకటాపూర్, వెంకటాపూర్ నుంచి నర్సాపూర్ వరకు బీటీ రోడ్డు, గూడెం చెక్ పోస్టు నుంచి గోదావరి పుష్కర్‌ఘాట్ వరకు సీసీ రోడ్డు, సదానందలయం నుంచి గూడెం బైపాస్ వరకు చేపట్టే రహదారుల నిర్మాణానికి కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య, గ్రామాల అభివృద్ధి, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్, వెల్గనూర్‌లో సౌర విద్యుత్ పైలట్ ప్రాజెక్టుకింద ఎంపిక చేశానన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మాణంతో గ్రామాల్లో పరిశ్రమలు ఏర్పడుతాయన్నారు. మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పార్టీ అధ్యక్ష కార్యదర్శు వెంకటేశ్వర్లు, సతీష్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌కు భూమి పూజ


క్యాంటీన్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లిరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళ సంఘాల ద్వారా నడిచే క్యాంటీన్ ద్వారా సంఘాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపడుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమీషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతిని గౌరవిస్తాం

బెల్లంపల్లిరూరల్/తాండూరు/కాసిపేట (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాయలంలో కాసిపేట మండలానికి చెందిన 17 దండారీ గ్రూపులకు ఒక్కో గ్రూపునకు రూ. 15 వేల చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. డీటీడీవో మడావి గంగారం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఆదివాసీ నాయకులు ఆడె జంగు, సోయం సూరు, ఆత్రం జంగు, పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

బెల్లంపల్లిరూరల్ (ఆంధ్రజ్యోతి): యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సింగరేణి మేనేజ్‌మెంట్ ట్రైనీ పరీక్షలో ఉద్యోగం సాధించిన రగడంబాల బస్తీకి చెందిన అనూప్ యాదవ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వినోద్ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. యువత క్రమశిక్షణతో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. నాయకులు మహేష్, మల్లయ్య, సూరిబాబు, ప్రభాకర్‌యాదవ్ పాల్గొన్నారు.


దండారీలకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మంచిర్యాల అర్బన్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే 18 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నల్ల మహేష్, ఆర్డీవో శ్రీనివాస్ రావు, తహసీల్దార్ రఫ్తతుల్లా హుస్సేన్, నాయకులు పూదరి తిరుపతి, తూముల నరేష్, నల్ల శంకర్, పోరెడ్డి రాజు, పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): దండేపల్లికి చెందిన మాదంశెట్టి రామన్న వైద్య ఖర్చుల కోసం ఎన్‌వోసీని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అందజేశారు. రామన్న నడుము నొప్పితో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం సంప్రదించాడు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళడంతో గురువారం ఎమ్మెల్యే వైద్య ఖర్చుల కోసం రూ.2 లక్షల ఎల్‌వోసి పత్రాన్ని బాధితుడికి అందజేశారు. శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.



అభాగ్యులకు అండగా 'ఆనంద నిలయం'
● వృద్ధులు, పిల్లలకు ఆశ్రయం
● అక్కున చేర్చుకుంటున్న రెడ్‌క్రాస్ సొసైటీ
7

ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి
● యేటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
● మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల తరువాత రాబడి
● రెబ్బెన, భీమినిమండలాల్లో ఆయిల్‌పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు
6

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు

● వాడవాడలా దీపాల కాంతులు ● బాణాసంచా పేలుళ్లు ● లక్ష్మీపూజలు, నోములు


దీపాలు వెలిగిస్తున్న మహిళలు


మంచిర్యాలలో బాణాసంచా దుకాణాల వద్ద బారులు తీరిన ప్రజలు


మ్యాదరిపేట షాప్‌లో ధనలక్ష్మీ పూజలు


బెల్లంపల్లిలో బాణాసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా చేసుకునే దీపావళి పండుగను గురువారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. లక్ష్మీదేవి పూజ, నోముల నేపథ్యంలో కిరాణ, పండ్ల దుకాణాలు కిక్కిరిసిపోయాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా బాణాసంచా కొనుగోలు చేశారు. సాయంత్రం వేళ ఇంటి ఎదుట దీపాలు వెలిగించడంతో వాడవాడలు విద్యుత్ కాంతులతో మెరిశాయి. సాయంత్రం లక్ష్మీపూజలు, కేథారేశ్వరి నోములు ఆచరించారు. ప్రజలు ఆలయాలను సందర్శించారు. ధన త్రయోదశి నుంచి ప్రారంభమైన వేడుకలు శనివారం వరకు కొనసాగనున్నాయి.

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం దీపావళి వేడులను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. వ్యాపా రులు దుకాణాలను విద్యుత్ దీపాలు, రంగురంగుల కాగితాలతో అరటి ఆకుల కొమ్మలతో అందంగా ఆలకరించారు. నూతన వస్త్రాలు ధరించి లక్ష్మీదేవి పూజలు చేశారు. వ్యాపారులు కొత్త ఖాతా పుస్తకాలను తెరిచి పూజలు చేశారు. ఇళ్లలో కేథారేశ్వరి, లక్ష్మీ పూజలు నిర్వహించారు. అనంతరం బాణాసంచా పేల్చారు.

బెల్లంపల్లిరూరల్ (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి పట్టణం, మండలంలో గురువారం దీపావళి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రాత్రి దీపాలు వెలిగించి చిన్నా పెద్ద తేడా లేకుండా టపాసులు కాల్చారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, కౌన్సిలర్లతో కలిసి బాణాసంచా పేల్చారు. పట్టణంలోని ప్రముఖ వ్యాపారస్తులను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వేమనపల్లి, (ఆంధ్రజ్యోతి) : మండలంలో దీపావళి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయాలకు వెళ్ళి పూజలు చేశారు. ఇండ్లలో లక్ష్మీ పూజలు చేసుకున్నారు. సాయంత్రం ఇండ్ల ముందు దీపాలను వెలిగించి టపాసులు కాల్చారు. శుక్రవారం ఇండ్లలో కేదారేశ్వర వ్రతాలను చేసుకున్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణ, మ ండల ప్రజలు దీపావళి పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే పంచకోశ ఉత్తర వాహిని గోదావరి నదిలో పుణ్య స్నానాలను ఆచరించారు. శివాలయం, జగన్నాథస్వామి, పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి హారతులు వెలిగించారు. రాత్రి బాణసంచా కాల్చి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు శుక్రవారం కేదారేశ్వర స్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు. వేకువజామునే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఇండ్లలో వివిధ రకాల పూలను సేకరించి కేదారేశ్వర స్వామి వ్రతాన్ని కన్నుల పండగగా నిర్వహించుకున్నారు.

భీమారం (ఆంధ్రజ్యోతి) : మండలంలో దీపావళి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మీదేవికి పూజలు చేశారు. సాయంత్రం ఇండ్ల ముందు దీపాలు వెలిగించి చిన్నా పెద్దా తేడా లేకుండా టపాసులు కాల్చి ఉత్సాహంగా గడిపారు. కిరాణం దుకాణాలతో పాటు టపాసుల దుకాణాలు ప్రజలతో కిటకిటలాడాయి.

మందమర్రిరూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలో దీపావళి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవికి పూజలు చేశా రు. రాత్రి ఇండ్ల ముందు దీపాలను వెలిగించి టపాసులు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండగను ఘనంగా జరుపుకున్నారు. వాణిజ్య సంస్థల్లో లక్ష్మీపూజలు చేశారు. రాత్రి ఇండ్ల ముందు దీపాలను వెలిగిం చి బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు.

వ్యాపారులకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే


వ్యాపారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

గర్మిళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లోని వ్యాపారులకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావులు దీపావళి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ దుకాణానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపి లక్ష్మీకటాక్షం అందరిపై ఉండాలని కోరుకున్నారు.

ముగిసిన దండారీ సంబరాలు

దండేపల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : దండేపల్లి మండలం గుడిరేవులో పద్మల్ పూరీకాకో ఆలయంలో గురువారం దీపావళి పండుగ సందర్భంగా ఆదివాసి గిరిజనులు పద్మల్‌పూరీకాకో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు, గిరిజన ఆరాధ్య దైవమైన కాకో ఆలయంలో 14 రోజుల నుంచి వేలాది మంది గిరిజనులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పిండివంటలు, ప్రత్యేక భజనలు, గుస్సాడి నృత్యాలతో గోదావరి తీరం మార్మోగింది. దీపావళి పండుగతో దండారీ ఉత్సవాలను గిరిజన సంప్రదాయంతో ముగించారు.

అకాల వర్షం .. నష్టం

దండేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలో గురువారం ఉరుములతో కూడిన కురిసిన అకాల వర్షంతో రైతులకు నష్టం వాటిల్లింది. మామిడిపల్లిలో వరి కోత దశలోకి రావడంతో గాలులతో కూడిన వర్షం కురవడంతో వరి పంట నేలవాలింది. వరి గింజలు నల్లబడతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు రైతుల వరిపంట కంకి దశలో ఉంది. నేలవాలడంతో నష్టం వాటిల్లింది.


పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నేల కొరిగిన పంటలు

భీమిని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పలు గ్రామాల్లో శుక్రవారం వేకుమజామున నుంచి ఉరుములు, మెరుపులతో వర్షం కురియడంతో భీమిని, ఖర్జీభీంపూర్, చిన్నగుడిపేట, వెంకటాపూర్, రాంపూర్ గ్రామాల్లో వరి పంటలు నేలకొరిగాయి. కొద్ది రోజుల్లో దిగుబడి చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం వల్ల ఇబ్బందులు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. నేలకొరిగిన పంటలను పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంటల పరిశీలన

కాసిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వరి పంటలు నేలకొరిగాయి. మల్కేపల్లి, పెద్దనపల్లి, దేవాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి గింజ గట్టిపడే దశలో ఉందని, వర్షం వల్ల పంట నేలకొరగడంతో నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. రైతులు నేలకొరిగిన వరి దుబ్బులను నిలబెట్టి కుచ్చులుగా కట్టుకోవాలని సూచించారు. ఏఈఓలు దీప్తి, రమ్య, రైతులు పాల్గొన్నారు.

హోంగార్డులు పోలీస్ శాఖలో భాగమే

● రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హోంగార్డులు పోలీస్ శాఖలో భాగమేనని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో హోం గార్డులు, సిబ్బందితో నిర్వహించిన దర్బార్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారులు, సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కమిషనరేట్ పరిధిలో 494 మంది హోంగార్డులు పనిచేస్తున్నారని, వారంతా పోలీస్ శాఖలో భాగమేనని, వారి సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. నిబంధనలను ధిక్కరిస్తే భవిష్యత్తులో శాఖ పరమైన ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఎలాంటి సమస్యలున్నా స్థానిక అధికారులకు, ఏసీపీ, డీసీపీలకు లేదా తనను నేరుగా సంప్రదించి తెలియజేయాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, సీఐలు, ఎస్సైలు, హోమ్ గార్డులు పాల్గొన్నారు.

అఘోరీ..

● సోషల్ మీడియాలో వైరల్
● రాష్ట్ర ప్రజల చూపు కుశ్నపల్లి వైపు

నెన్నెల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అఘోరీ.. శరీరమంతా బూడిద పూసుకొని, పొడవైన జుట్టు, మెడ నిండా రుద్రాక్షలు ధరించి నగ్నంగా సంచరిస్తోంది. శ్మశానాల్లో కాలం గడిపే అఘోరీ జనావాసాల్లో తిరగడం సంచలనంగా మారింది. కారులో రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలు దర్శనం చేసుకుంటున్న అఘోరీ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తాజాగా ఆత్మార్పణ చేసుకుంటానని ప్రకటించడం హాట్ టాపిక్‌గా మారింది. పోలీసుల బందోబస్తు మధ్య స్వగ్రామం కుశ్నపలల్లిలో గృహ నిర్బంధంలో ఉండడంతో అందరి దృష్టి కుశ్నపల్లి గ్రామంపైనే పడింది.

● కుటుంబ నేపథ్యం

ఎల్లూరి శ్రీనివాస్ అనే 24 ఏళ్ల యువకుడు ట్రాన్స్‌జెండర్‌గా మారాడు. కుశ్నపల్లి గ్రామానికి చెందిన ఎల్లూరి చిన్నయ్య-చిన్నమ్మలకు ఐదుగురు కొడుకులు, ఒక కూతురు వారిలో నాలుగవ సంతానమే శ్రీనివాస్, పదేళ్ల వయసులోనే ఇంటి నుంచి వెళ్ళిపోయిన అతను 14 ఏళ్ల తరువాత 2024 ఏప్రిల్ 21న అఘోరీగా గ్రామంలో ప్రత్యక్షమైంది. ఎల్లమ్మ గుడిలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొంది. విష్ణు బ్రహ్మ అఘోరీ నాగసాధుగా మారి దేశ సంచారం చేస్తున్నానని, కేదారినాథ్, హరిద్వార్ ప్రాంతాల్లో గురువుగారి సమక్షంలో కఠోరా సాధన చేసి అఘోరీగా మారినట్టు చెబుతోంది.


తల్లిదండ్రులతో అఘోరీ

● సోషల్ మీడియాలో వైరల్

నెల రోజుల కిందట కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పూజల్లో పాల్గొన్నది. ఇటీవల ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం అనంతరం శాంతి పూజలు చేసింది. ఈ క్రమంలో పలు యూట్యూబ్ చానళ్లల్లో ఇంటర్వ్యూలు ప్రసారం చేయడంతో అందరికి తెలిసింది. ఆమెను చూసేందుకు, ఆశీర్వాదాలు పొందేందుకు ప్రజలు ఎగబడుతున్నారు. కొందరు అఘోరీ ప్రజలను మోసం చేస్తోందని పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో అఘోరీ తిరిగి కేదారినాథ్ వెళ్లిపోయింది. సనాతన ధర్మం కోసం దిపావళీ మరుసటి రోజున ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆత్మార్పణ చేసుకుంటానని కేదారినాథ్ నుంచే ప్రకటించింది. రాష్ట్రానికి రావడంతో అప్రమత్తమైన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని స్వగ్రామం కుశ్నపల్లికి తరలించి తల్లిదండ్రులకు అప్పగించారు. అఘోరీపై తప్పుడు ప్రచారం చేయడం సరి కాదని కుటుంబ సభ్యులంటున్నారు.

కుటుంబీకులతో మాట్లాడిన ఎమ్మెల్యే

బెల్లంపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి) : కుశ్నపల్లి గ్రామానికి చెందిన అఘోరీ మాత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను క్యాంపు కార్యాల యంలో కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మార్పణం చేసుకోవడం పరిష్కారం కాదని, ఈ విష యాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని అఘోరిమాతకు చెప్పాలని కుటుంబీకులకు సూచించారు.

సర్వే ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

హాజీపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం, రాపల్లి గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఇతర అన్ని అంశాలపై ప్రభుత్వం చేపట్టిన సర్వేను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్యుమరేషన్ బ్లాక్‌ల ప్రకారం నిర్ణీత నమూనాలో కుటుంబాల వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రతి 10ఎన్యుమరేషన్ బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించి వివరాలను పునఃపరిశీలిస్తామన్నారు. వివ రాల సేకరణలో గోప్యత, నైతిక ప్రమాణాలు పాటిం చాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, మండల పంచాయతీ అధికారి తదితరులు పాల్గొన్నారు.


రాపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

సర్వేపరిశీలించిన ఎమ్మెల్యే

బెల్లంపల్లిరూరల్ (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెండవ వార్డులో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో హరికృష్ణ సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కులం అంశాలపై సర్వే చేపట్టాలన్నారు. ప్రతి ఇంటిలోని కుటుంబాల వివరాలను నమోదు చేయాలని, ఏ ఒక్క ఇంటిని వదిలిపెట్టవద్దని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మండలంలో ప్రారంభమైంది. పొనకల్ గ్రామంలో నిర్వహించిన సర్వేను డీఆర్‌డీవో కిషన్ పరిశీలించారు. రోజు సర్వే నివేదికను అందించాలని, తప్పులు లేకుండా చేయాలన్నారు. రోజు 150 కుటుంబాలను గుర్తించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఏపీవో రవీందర్,ఏపీఎం బుచ్చన్న, ఈవో రాహుల్‌గుప్తా తదితరులు ఉన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే మండలంలో ప్రారంభమైంది. మండల కేంద్రంలో జరిగిన సర్వేను ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావులు పరిశీలించారు. ఎన్యుమరేట్ బ్లాక్ వారీగా ప్రతీ ఇంటికి సర్వే స్టిక్కర్లను అంటించారు. ఏపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సామాజిక సర్వే శుక్రవారం ప్రారంభమైంది. శుక్రవారం ఇంటింటికి వెళ్లి మొదటి దఫాగా స్టిక్కర్లను కుటుంబ యజమాని ఇంటికి అతికించారు. సర్వే రెండు దఫాలు గాకొనసాగుతుందని తెలిపారు. ఉపాధి సిబ్బంది, ఉపాధ్యాయులు, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి సర్వేకు సహకరించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శుక్రవారం చిర్రకుంటలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు.